క్లుప్తంగా

నేడు ఎంబీ హైస్కూల్ ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు

గద్వాల: జిల్లా కేంద్రంలోని ఎంబీ ఉన్నత పాఠశాల 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 29న ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల హెచ్ఎం ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలు విజయవంతం చేయాలని కోరారు.

ఆత్మీయ సమ్మేళనం



గద్వాల అర్బన్: గద్వాల జిల్లాలో బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసేందుకు సోమవారం ఉదయం 10గంటలకు జిల్లా కేంద్రంలోని కేఎస్ ఫంక్షన్ హాల్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగర్దొడ్డి వెంకట్రాములు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమ్మేళనంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు అతిఖుర్ రహ్మాన్, కుర్వపల్లయ్య, మక్బూల్, యూనుస్ ఉన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడొద్దు



కేటీదొడ్డి: బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని జిల్లా బీఆర్ఎస్ నాయకులు బాసు హనుమంతు నాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని చింతలకుంట, మల్లాపురం, సోంపురం, ఎర్సందొడ్డి, ఇర్కిచేడు గ్రామాల్లో ఆయన పర్యటించి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీదే భవిష్యత్ అని, ప్రతి కార్యకర్తకు ఏ ఆపద వచ్చిన తనను సంప్రదించాలని, ఎల్లప్పుడు అండగా ఉంటానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందలేదని వారు తెలిపారు. నడిగడ్డ ప్రజలందరూ బీఆర్ఎస్ పార్టీవైపే ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నూర్‌బాషా, రాజునాయుడు, బాసు గోపాల్, వీరేష్, కిష్టప్ప, ధనుంజయ్, తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తాం



మానవపాడు: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి మెజార్టీ స్థానాల్లో గెలుస్తామని రాష్ట్ర ఓబీసీ ప్రోగ్రామ్ కన్వీనర్ నాగమల్లయ్య తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో రాజగోపాల్, బలరాఘవరెడ్డి, మురళీకృష్ణ, లక్ష్మీనారాయణ, శేఖర్, తిమ్మప్ప, వెంకటేష్, పరశురాముడు, మధుసూదన్, రవి పాల్గొన్నారు.

ఒకే భవనంలో పాఠశాల.. గ్రామ పంచాయతీ



గట్టు: చూసే వారిని బట్టి ఆ భవనం రెండు విధాలుగా కన్పిస్తుంది. గంగిమాన్‌దొడ్డి ప్రాథమిక పాఠశాల భవనం రెండు విధాలుగా ఉపయోగపడుతోంది. విద్యార్థుల తల్లిదండ్రులకు ఇది పాఠశాలగాను, గ్రామ స మస్యలపై వచ్చే వారికి పంచాయతీగాను ఈ భవనం కన్పిస్తుంది. ఓ వైపు విద్యార్థులకు పా ఠాలు చెబుతుండగా, మరో వైపు గ్రామ సమస్యలపై చర్చ కూడా ఒకేసారి కొనసాగుతుంది. అద్దె భవనాల కొరత, సొంత భవనాలు లేక పోవడంతో గంగిమాన్‌దొడ్డి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలోనే గ్రామ పంచాయతీ భవనా న్ని కొనసాగిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఇ బ్బంది పడుతున్నారు. ఐదేళ్ల క్రితం గంగిమాన్‌దొడ్డిని పంచాయతీగా గుర్తించారు. పంచాయతీకి సొంత భవనం లేక, గ్రామంలో అద్దె భ వనాలు లభించక పాఠశాలలోనే గ్రామ పంచాయతీ భవనాన్ని కొనసాగిస్తున్నారు. గ్రామ పంచాయతీకి సొంత భవనం నిర్మించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ నరేష్, ఆంజనేయులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల కొరత తీర్చాలని వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

నదీతీరంలో నాట్ల పండుగ

- జోరుగా వరినాట్లకు రైతులు సిద్ధం
- గ్రామాల్లో మొదలైన నాట్లు
- నదిలో నీటి రాకతో రైతుల్లో జోష్



మాన్‌దొడ్డిలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

రాజోళి: నదీతీర గ్రామాల్లో రైతులకు నాట్ల పండుగ మొదలైంది. వానాకాలం సీజన్ ఆరంభంలో కొంత ఆందోళనకు గురైన అన్నదాతలు, ఆలస్యంగా కురిసిన వర్షాలు, ఎగువ నుంచి తుంగభద్రకు వస్తున్న వరద నీటి ఆధారంగా నాట్లు వేసేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలోనే చాలా గ్రామంలో గత నెల చివరి వారంలో నారు పోసుకుని సిద్ధంగా ఉంచుకున్నారు. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నాట్లు వేసేందుకు రైతులు ప్రణాళిక తయారు చేసుకోగా, కొన్ని గ్రామాల్లో ఇప్పటికే నాట్లు మొదలయ్యాయి.

గత నెలలోనే నార్లు సిద్ధం..

వానాకాలం సాగులో భాగంగా అలంపూర్ నియోజకవర్గంలోని ఆయా మండలాల పరిధిలోని నదీ తీర గ్రామాల్లో వరి సాగు చేస్తారు. ప్రతి ఏడాది లాగానే ఈ ఏడాది కూడా నారు సిద్ధం చేసుకున్నారు. సరైన వర్షాలు లేకపోవడంతో, పక్క రైతుల బోర్ల నుంచి నీరు తీసుకుని నారు ఎండిపోకుండా చూసుకున్నారు. ఎగువ నుంచి తుంగభద్రకు నీటి ప్రవాహం లేకపోవడంతో నదీతీర గ్రామాల్లో రైతులు ఆందోళనకు గురయ్యారు. వర్షాలు కురవడంతో వారి ఆశలకు ఊపిరి అందింది.

నాట్లు మొదలు..

వరి నాట్లు వేసేందుకు నీరు పుష్కలంగా ఉండాలి. వారం రోజుల పాటు కురిసిన వర్షాలకు రైతులు కరిగెట చేసుకుని నాట్లు వేసేందుకు సిద్ధం చేసుకున్నారు. కర్ణాటక పరిధిలో సమృద్ధిగా వర్షాలు కురవడంతో తుంగభద్ర నదిలో వరద నీరు పోటెత్తుతోంది. ప్రస్తుతం ఎగువ నుంచి తుంగభద్రలో నీటి ప్రవాహం వస్తుండటంతో రైతులు నాట్లు వేసే ప్రక్రియను జోరు పెంచారు.

వేలాది ఎకరాల్లో నాట్లు..

అలంపూర్ నియోజకవర్గంలోని అలంపూర్, రాజోళి, వడ్డేపల్లి, మానవపాడు, ఉండవెల్లి మండలాల్లో తుంగభద్ర నది పరివాహక గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో నదిపై ఆధారపడి వేసే రైతులతో పాటుగా ఆర్‌డీఎస్ కెనాల్, తుమ్మిళ్ల లిఫ్ట్, బోర్లు, బావులు కింద వరి నాట్లు వేసే రైతులున్నారు. వేలాది ఎకరాలు ఈ వానాకాలం సీజన్‌లో నాట్లు పడతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

నారు ఎండిపోతుందనుకున్నాం



గత నెలలో వరి నారు సిద్ధం చేసుకున్నాం. వర్షాలు రాలేదు. నదిలో నీరు కూడా లేకపోవడంతో కొంత ఆందోళన చెందాం. బోర్లు ఉన్న రైతులు నీరివ్వడం వల్ల చాలా మంది రైతులు తమ నారు ఎండిపోకుండా కాపాడుకోగలిగారు. ప్రస్తుతం మంచి వర్షాలు కురిశాయి. నదిలో కూడా నీరు వస్తోంది.

– పరమేష్ గౌడ్, రైతు, పెద్ద ధన్వాడ

నిండుగా ప్రవహిస్తోంది..



నిన్న మొన్నటి దాకా రాళ్లు తేలిన తుంగభద్ర నది ప్రస్తుతం నిండుగా ప్రవహిస్తోంది. దీంతో నది పక్కనే ఉన్న గ్రామాల్లో నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నా. దీని కోసం సేద్యం పనులు మొత్తం పూర్తి చేసుకున్నారు. నారు కూడా తెచ్చుకుంటున్నాం. ఇక నాట్లు వేయడమే తరువాయి. కొంత ఆలస్యంగానైనా నదిలో నీరు రావడం సంతోషంగా ఉంది.

– గోపాల్ రెడ్డి, తూర్పుగార్లపాడు

క్రీడాప్రాంగణాలు బోర్డులకే పరిమితం



అమరవాయి పాఠశాలలో ఉన్న క్రీడా ప్రాంగణం

మానవపాడు: యవతను క్రీడారంగంలో ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు బోర్డులకు మాత్రమే పరిమితమయ్యాయి. పాఠశాల ప్రాంగణంలో క్రీడామైదానాలు ఏర్పాటు చేశారు. పాఠశాల సమయంలో ఆడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థుల చదువులకు ఆటంకాలు తప్పవు. క్రీడామైదానాలు ఏర్పాటు చేసినప్పటికీ మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లోని యువతను వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయలేదు. నామమాత్రపు క్రీడా సామగ్రితో పాటు బోర్డులు ఏర్పాటు చేసి వదిలేశారు. క్రీడాప్రాంగణాల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ కోర్టులు, లాంగ్ జంప్‌లతో పాటు వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయాలని గైడ్‌లైన్స్‌లో పేర్కొన్నారు. ఏ గ్రామంలోని క్రీడా ప్రాంగణాల్లో కనిపించడంలేదని ఆయా గ్రామాల క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టార్గెట్ పూర్తి చేయడానికి క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేశారా? అంటూ గ్రామంలో యువకులు, ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి యువతకు క్రీడా మైదానాలు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

మన్‌కీబాత్ వీక్షించిన నాయకులు



అలంపూర్‌లో మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని బీజేపీ నాయకులు ఆదివారం మన్‌కీబాత్ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రసంగాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాగ మద్దిలేటి, మహేష్, పరశురాం, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

అయిజ: పట్టణంలోని భరత్‌నగర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కార్యకర్తలతో కలిసి మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ సూచనల మేరకు చేనేత వస్త్రాలు, ఖాదీ వస్త్రాలు ధరించి చేనేత కార్మికులకు చేయూతనివ్వాలన్నారు. ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకుండా ఉండాలని, మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గోపాలకృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి భగత్ రెడ్డి, పట్టణ ఓబీసీ అధ్యక్షుడు వెంకటేష్, భీమసేనరావ్, లక్ష్మణాచారి, విక్రం, వీర రాఘవ రెడ్డి పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు అందించండి



పెద్దఆముదాపాడులో వృథాగా ఉన్న మిషన్‌భగీరథ పైప్‌లైన్

మానవపాడు: గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి నేటి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం వరకు మిషన్ భగీరథ తాగునీరు అందడం లేదని మండలంలోని పెద్దఆముదాలపాడు గ్రామానికి చెందిన గ్రామస్తులు నరసింహ, నాగరాజు, అయ్యన్న, రేవన్న, సుధరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. చాలాసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గ్రామంలోని ఎస్సీకాలనీలోని 7వ వార్డులో తాగటానికి నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి మిషన్ భగీరథ నీరు అందించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హామీలు అమలు చేయాలి

గద్వాల అర్బన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వ్య వసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్య దర్శి వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మహాలక్ష్మి పథకం కింద రూ.2500, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు, ఆసరా పింఛన్ల పెంపు తదితర హామీలకు నిధులు కేటాయించలేదని మండిపడ్డారు. అనంతరం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రేపల్లె దేవదాస్, ప్రధాన కార్యదర్శిగా రాజు, జిల్లా సహాయ కార్యదర్శులుగా రాఘవేంద్ర యాదవ్, దావుద్‌లను ఎన్నుకున్నారు.

బడిబయట పిల్లలు బడిలో ఉండాలి



బడి బయటి పిల్లలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంవీఎఫ్ సభ్యులు

కేటీదొడ్డి: బడి బయట పిల్లలందరూ బడిలో ఉండాలని మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని కుచినెర్ల గ్రామంలో బడి బయటి పిల్లలపై ఎంవీఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6 నుంచి 14 సంవత్సరాల పిల్లలను పనిలో పెట్టుకోవద్దని, సీడ్ పత్తికి పిల్లలను పంపితే వారి తల్లిదండ్రులపై పోలీస్ కేసు అవుతుందన్నారు. బడి బయట ఉన్న ప్రతి చిన్నారిని బడికి పంపాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవీఎఫ్ సభ్యులు కిరణ్, తదితరులు ఉన్నారు.

40 ఏళ్ల తర్వాత కలిశారు..



గద్వాల: 40 వసంతాల అనంతరం వారంతా మళ్లీ కలిశారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. శ్రీ రవీంద్ర హైస్కూల్ 1984–85లో పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఫంక్షన్ హాల్లో పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో కలిశారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యార్థులంతా ఒకచోట కలవడంపై సంతోషం వ్యక్తం చేశారు.

పల్లెప్రకృతివనంపై పట్టింపేది?



మానవపాడు: గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాలలో పల్లెప్రకృతివనం ఒకటి. నేడు పల్లెప్రకృతివనాలు నిరుపయోగంగా మారాయి. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందిచడానికి ఏర్పాటు చేయగా, నేడు అవి మురికి కుపాలుగా, చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. పల్లెప్రకృతివనాలకు వెళ్లితే ఆహ్లాదం పక్కాన పేడితే ఆయాసం వచ్చే పరిస్థితి ఉందనే విమర్శలు వ్యక్తం చేస్తున్నారు గ్రామస్థులు ఇప్పటికైనా గ్రామాల్లో పల్లెప్రకృతివనాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అధికారుల పర్యవేక్షణ ఏది?



ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులోని కొట్టాల కాలనీలో రోడ్డు ఉన్న అందులో మురుగు నిలవడంతో కాలనీ వాసులకు వ్యాధులు సంభవిస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. అంతర్గత రోడ్లు ఉన్నా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో కాలనీ ప్రజల తిప్పలు తప్పడం లేదు. మురుగులో దోమలు ఇళ్లలోకి వస్తున్నాయని, ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. మురుగును శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ వేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ముళ్లపొదలను తొలగించండి

మానవపాడు: మండల కేంద్రం నుంచి గోకులపాడు గ్రామానికి వెళ్లే రహదారి వెంట రెండు వైపులా ముళ్ల చెట్లు వ్యాపించిఉన్నాయి. ప్రయాణించడానికి వాహనాదారులకు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు చర్యలు తీసుకోని ముళ్లపొదలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న దివ్యాంగులు

గద్వాల రూరల్: దివ్యాంగులకు కమ్యూనిటీ హాల్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కో రుతూ ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా దివ్యాంగుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పలు స మస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో దివ్యాంగుల సేవా సంఘం అధ్యక్షుడు చంటి, ఉపాధ్యక్షుడు జయంతుడు, తదితరులు ఉన్నారు.

అచ్చమ్మకు అండగా సేవా సమితి



అచ్చమ్మకు నిత్యావసర సరుకులు, ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు, సేవాసమితి సభ్యులు

శాంతినగర్: ఎవరూ లేకుండా కాలం వెళ్లదీస్తున్న అచ్చమ్మ అవ్వకు ఆధరణ లభించే వరకు సేవాసమితి అండగా ఉంటుందని శాంతినగర్ సేవా సమితి వడ్డేపల్లి సభ్యులు పేర్కొన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ రామాపురం రోడ్డు సమీపంలోని పూరిపాకలో అనాథగా ఉన్న అచ్చమ్మ అ వ్వకు సేవాసమితి, పట్టణానికి చెందిన దాతలు ఆదివారం ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి భార్యాభర్తలు ఇక్కడికి రాగా, భర్త చనిపోవడంతో అచ్చమ్మ అనాథగా మిగిలింది. ఆమెకు కనీసం ఆధార్‌కార్డు కూడా లేకపోవడంతో ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందడంలేదు. ఏపని చేతకాకపోవడంతో పస్తులుంటూ కాలం వెళ్లదీస్తోంది. ఈ విషయం తెలుసుకున్న సేవా సమితి సభ్యులు గత నెలలో అవ్వకు నెలవరకు కావాల్సిన నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం అందజేశారు. ఈనెలకు సంబంధించి రూ.2200 ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. అచ్చమ్మ అవ్వకు ఆధరణ లభించేవరకు సేవాసమితి అండగా ఉంటుందని సేవాసమితి సభ్యులు భరోసా ఇచ్చారు. ఈనెల మొబైల్ వేణు, గాయత్రి శ్రీను, గౌసియా, శ్రీను, మార్కెట్ మోహిన్, దేవేందర్‌రెడ్డిలు ఆర్థిక సాయం అందించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు షేక్ అస్లాం షరీఫ్, వెంకటేష్, దొండె రమేష్, రాజు, శివుడు, మాలిక్, ఆటో ఖలీల్, హనిమిరెడ్డిలు పాల్గొన్నారు.

నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మద్దూరు పంటపొలాల్లోకి చేరిన తుంగభద్ర నీరు

మానవపాడు: తుంగభద్ర నది తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్ఐ గురురాజ్ సూచించారు. ఆదివారం మండలంలోని నదీ తీర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తుంగభద్ర పరివాహక ప్రాంత మద్దూరు, కొర్విపాడు గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. మద్దూరు గ్రామం పంట పొలాల్లోకి తుంగభద్ర నీరు వచ్చిందన్నారు. ఆయన వెంట అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆదరణ కరువు

- మండలంలో 34 అంగన్‌వాడీ కేంద్రాలు
- గతంలో కంటే తగ్గిన ఆదరణ
- మొత్తం కేంద్రాల్లో 631 మంది చిన్నారులు
- బాలామృతంతో పిల్లల పెంపకం..
- మూడు నెలలకే చిన్నారులను ప్రైవేట్ స్కూళ్లకు..



బస్వాపురంలో మధ్యాహ్న భోజనంలో చిన్నారులు

ఉండవెల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను వదిలితే రోజు గుడ్డు, పాలు, భోజనం, బాలామృతం అందిస్తారని తల్లిదండ్రులు పంపించేవారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను మూడు నెలలు వదిలి, తర్వాత తల్లిదండ్రులు ప్రైవేట్ స్కూళ్లల్లో చేర్పిస్తున్నారు. ఉన్నతాధికారులు కచ్చితంగా అంగన్‌వాడీల్లో పిల్లలు చదివించాలని నిబంధన పెట్టినా తల్లిదండ్రులు లెక్క చేయడం లేదు. రెండేళ్ల నిండక ముందే ప్రైవేట్ స్కూళ్లకు పిల్లలను పంపుతున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారుల సంఖ్య ఆదరణ లేకుండా పోతోంది.

మండలంలో 34 కేంద్రాలు..

మండలంలో 34 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ప్రతి గ్రామంలో మినీ కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు అందుబాటులో ఉన్న చిన్నారులను మాత్రం తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకే పరిమితమయ్యేలా చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను నూతనంగా ఏర్పాటు చేసినా ప్రైవేటు పాఠశాలలకు పంపించేందుకు మక్కువ చూపుతున్నారు. పట్టణాలకంటే పల్లెటూరులోని తల్లిదండ్రులే చిన్నారుల భవిష్యత్ బాగుండాలని ప్రైవేట్‌కు పరిచయం చేస్తున్నారు. దీనిని అరికట్టాలనే వారం రోజులు బడిబాట నిర్వహించిన ఉపాధ్యాయులు వారి బదిలీలలో పడిపోయారు. ప్రస్తుతం ఎలాంటి సంఖ్య పెంచకపోవడం, రాష్ట్ర విద్యాశాఖ లేకపోవడంతో పట్టింపులేదని నాయకులు పేర్కొంటున్నారు.

తగ్గుతున్న పిల్లల సంఖ్య..

ప్రతి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం అందుబాటులో ఉన్న ప్రైవేటు పాఠశాలలకే ఎక్కువ వెళ్తున్నారు. చిన్నారులపై ఒత్తిడి తెచ్చి రోగ నిరోధక శక్తిపై ప్రాధాన్యతను సంతరించుకోకుండా వ్యాధిగ్రస్తులుగా మారుస్తున్నారు. చిన్నారులు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో గతంలో 641 ఉండగా, ప్రస్తుతం 631 చిన్నారుల సంఖ్య పడిపోయింది. ఇంక నాలుగు నెలలు దాటితే 300కి పడిపోతారని, అందరిని ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తారని అధికారులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా చిన్నారుల ప్రైవేట్ పాఠశాలలపై జిల్లా విద్యాధికారులు చొరవ తీసుకుని పరిశీలించి అనుమతి ఇవ్వాలంటున్నారు.

సంఖ్య తగ్గుముఖం..

రోజురోజుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య పడిపోతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చిన్నారులకు ప్రైవేట్ బస్సులు పంపించి ఒత్తిడికి గురిచేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చిన్నారులకు మంచి మార్గాలు ఉంటాయి. తల్లిదండ్రులు ఆలోచించాలి. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు అన్ని మండలాల్లో ఏర్పాటు చేశాం.

– సుజాత, సీడీపీఓ, మానవపాడు

రోడ్లపై మలుపు.. ప్రమాదానికి పిలుపు



అమరవాయి - బిజ్వారం మధ్య ఉన్న మలుపు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాలకు ఏర్పాటు చేసిన బీటీ రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. రోడ్ల మలుపుల వద్ద అధికారులు ఎలాంటి సూచికబోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మ ల్దకల్ నుంచి మద్దెల బండ, అమరవాయి నుంచి బిజ్వారం, పె ద్దొడ్డి నుంచి మల్దకల్, కుర్తిరావులచెర్వు నుంచి మల్దకల్ గ్రామాల మధ్య ఉన్న రోడ్లపై మ లుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అ ధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవ డం లేదని వాహనదారులు పేర్కొన్నారు. ఇ ప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రో డ్లపై ఉన్న మలుపుల వద్ద సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.